

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



రాజమహేంద్రవరం : ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ ఫోరం తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం తయారు చేసిన సాంఘిక శాస్త్రం స్టడీ మెటీరియల్‌ను డిఎస్ఇఒ కె.వాసుదేవరావు సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. స్టడీ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు దువ్వూరి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హుకుంపేట సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పిఎల్.ఫణికుమార్ దీన్ని తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు కోలా సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కెవి.రమణారావు, ఎస్ఎల్‌వి.రమేష్, జి.ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు

మూతబడుతున్న హాస్టళ్లు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో ఉన్న సంక్షేమ వసతిగృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో వసతులు కొరవడ్డాయి. కొన్ని శిథిలావస్థకు చేరాయి. మరికొన్ని మూతబడ్డాయి. ఉన్నా హాస్టళ్లలోనూ సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొంత మంది విద్యకు దూరమవుతున్నారు.

గోపాలపురం మండలంలో ఐదు సంక్షేమ వసతిగృహాలు ఉన్నాయి. అందులో మూడు ఎస్‌సి వసతిగృహాలున్నాయి. గోపాలపురం, రేగులకుంటలో బాలురుకు, రాజంపాలెం బాలికలకు కేటాయించారు. రెండు బిసి వెల్ఫేర్ బాలుర హాస్టల్స్ గోపాలపురం, రాజంపాలెంలో ఉన్నాయి. ప్రస్తుతం ఇవి రెండూ శాశ్వతంగా మూతపడ్డాయి. మరొక రెండు వసతిగృహాలను అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రేగులగుంట వసతిగృహం మాత్రమే సొంత భవనంలో కొనసాగుతుంది. ఈ ఐదు హాస్టలకు సంబంధించి గతంలో 500 వరకు విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం మూడు హాస్టల్స్ కలిపి 100 మంది లోపు మాత్రమే విద్యార్థులు ఉన్నారు.


మూతబడిన రాజంపాలెం వసతిగృహం

మూతబడిన హాస్టళ్లు

మండలంలో మూడు వసతిగృహాలు శిథిలావస్థలో ఉండడంతో అవి మూతపడ్డాయి. మండలంలో రాజంపాలెంలో ఉన్న ఎస్‌సి బాలికల వసతిగృహం 1988లో ఏర్పాటు చేశారు. 2022లో దానిని మూసివేశారు. ఇందలో 80 మంది వరకూ బాలికలకు వసతి ఉండేది. హాస్టల్ శిథిలావస్థకు చేరడంతో పూర్తిగా మూసివేసినట్లు అధికారులు తెలిపారు. గోపాలపురంలోని బిసి(బాలురు)-1, ఎస్‌సి(బాలురు)1 వసతిగృహాలను 1987లో అప్పటి సిఎం ఎన్‌టిఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ రెండు హాస్టల్స్‌లో ఒక హాస్టల్ సంబంధించి సుమారు 100 మంది వరకు విద్యార్థులు ఉండేవారు. ఈ హాస్టల్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతులు చేయించారు. అయినప్పటికీ విద్యార్థుల సంఖ్య 5కు పడిపోయింది. ఈ కారణంతో హాస్టల్‌ను మూసేశారు.

అద్దె భవనాల్లో అరకొర వసతులు

మండలంలో రెండు హాస్టల్స్ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గోపాలపురంలో ఎస్‌సి బాలుర హాస్టల్ శిథిలావస్థకు చేరుకోవడంతో అద్దె భవనంలోకి మార్చారు. ఈ భవనంలో బెడ్లు వేసుకునే వీలులేకపోవడంతో నేలపైనే విద్యార్థులు పడుకుంటున్నారు. రాజంపాలెంలోని బిసి బాలుర హాస్టల్ 35 ఏళ్లగా అద్దె భవనంలోనే కొనసాగుతుంది. హాస్టల్‌ను తరుచూ పలు ప్రాంతాలకు మార్చడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పడుకునే వీలుకూడా లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు హాస్టల్స్‌లో విద్యార్థులు సంఖ్య కూడా 20 లోపునకు పడిపోయింది. మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి.

సిబ్బంది కొరత..సంరక్షణ లోపం

ఐదు హాస్టళ్లకు నేటికీ సొంత వార్డెన్లు లేరు. ఇన్‌ఛార్జులే వీటికి సంరక్షకులుగా ఉన్నారు. సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న వార్డెన్లకు ఇక్కడ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించడంతో వార్డెన్ల పర్యవేక్షణ కొరవడింది. ఒక వార్డెన్‌కు రెండు, మూడు హాస్టల్లో బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో వారు సమయం కేటాయించలేకపోతున్నారు. వార్డెన్లు హాస్టల్‌కు రాకపోవడంతో సంరక్షణ కొరవడింది. విద్యార్థులు సంఖ్య తగ్గిపోవడానికి ఇది కూడా ప్రధాన కారణం.

హాస్టల్స్‌ను తిరిగి ప్రారంభించాలి

మూతబడిన హాస్టల్స్‌ను తిరిగి ప్రారంభించాలి. రాజంపాలెంలోని శిథిలావస్థలో ఉన్న ఎస్‌సి బాలికల హాస్టల్ భవనం తొలగించి శాశ్వత భవనం నిర్మించే వరకు అద్దె భవనంలో కొనసాగించాలి. మూతబడిన గోపాలపురంలోని బిసి బాలుర హాస్టల్‌ను తిరిగి ప్రారంభించాలి.


అద్దె భవనంలో నేలపైనే పడుకున్న గోపాలపురం హాస్టల్ విద్యార్థులు

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం...

రాజంపాలెంలోని హాస్టల్‌ను అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు బెడ్ లేక ఇబ్బందులు ఉన్నాయి. సొంత భవన నిర్మాణంపై ఉన్నతానధికారుల దృష్టికి తీసుకెళ్తాం. గోపాలపురంలో హాస్టల్‌కు హైస్కూల్‌కు మధ్య దూరం సుమారు 2.5 కిలోమీటర్లు ఉండడంతో విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గింది. దీంతో ఆ హాస్టల్‌ను మూసివేశాం.

- టివి.ప్రసాద్ అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్

ప్రతిపాదనలు పంపించాం...

రెండు హాస్టల్ భవనాలకు రూ.6 కోట్లు అవసరం అవుతాయి. ఈ మేరకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే కొత్త భవనాలు నిర్మిస్తాం. మండలంలో మూడు ఎస్‌సి హాస్టల్స్ ఉన్నాయి. అందులో రెండు భవనాలు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. హాస్టల్ పాడవ్వడం, బాలికలు సంఖ్య తగ్గడంతో ఒక హాస్టల్ మూసి వేశాం. మరొక హాస్టల్‌ను అద్దె భవనంలో కొనసాగిస్తున్నాం. హాస్టల్ వార్డెన్, క్లాస్ ఫోర్ సిబ్బంది కొరత ఉంది. దీనిపై ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- ఎం.సందీప్, ఎఎస్‌డబ్ల్యూ, దేవరపల్లి

అదనపు హాస్టల్స్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ


కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నగరంలోని అదనంగా ఎస్‌టి బాలికల హాస్టల్స్‌ను ఏర్పాటు చేయాలని, అదనపు సీట్లు ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ కీర్తి చేకూరికి ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా మాట్లాడారు. ఎస్‌టి బాలికల హాస్టల్స్‌లో సీట్లు నిండిపోయాయన్నారు. డిగ్రీ 2వ కౌన్సిలింగ్‌లో వచ్చిన విద్యార్థులకు హాస్టల్ సీట్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. మంగళవారం నుంచి డిగ్రీలో ప్రవేశాలకు 3వ కౌన్సిలింగ్ నిర్వహిస్తారన్నారు. వారికి కూడా హాస్టల్ సీట్లు అవసరమన్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే తక్షణమే ఎస్‌టి బాలికల హాస్టల్‌ను అదనంగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించామన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించారన్నారు. తక్షణమే అదనపు హాస్టల్స్ ఏర్పాటు చేయడానికి అద్దె బిల్డింగ్ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నూతనంగా బిల్డింగ్ నిర్మాణానికి అనుమతులు కోరుతూ ఉన్నతాధికారులకు అధికారులు లేఖ రాసినట్టు తెలిపారన్నారు. జిల్లా ఎస్‌టి వెల్ఫేర్ ఆఫీసర్ కె.జ్యోతి మాట్లాడుతూ హాస్టల్స్‌లో సీట్లు కేటాయిస్తామని, అయితే అద్దె భవనం దొరికే వరకూ విద్యార్థులు సర్దు కోవాలన్నారు.

రెజ్లింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - రాజానగరం


రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న విసి ప్రసన్నశ్రీ

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో రెజ్లింగ్ మెన్ అండ్ ఉమెన్ ఇంటర్ కాలేజీయట్ కం యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. విసి ఎస్.ప్రసన్నశ్రీ ఈ పోటీలను ప్రారంభించారు. యూనివర్సిటీలోని ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ పోటీల్లో విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నుంచి 51 మంది పాల్గొన్నారు. ఉమెన్ ఫ్రీ స్టైల్ 50 కేజీల నుంచి 76 కేజీల కేటగిరి వరకు జరిగాయి. వీటిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను యూనివర్సిటీ టీమ్‌గా ఎంపిక చేసి రాజస్థాన్‌లోని కోటా విశ్వవిద్యాలయంలో ఈ నెల 27 నుంచి 30 తేదీ వరకు జరిగే సౌత్ జోన్ పోటీలకు హాజరవుతారు. రెజ్లింగ్ మెన్ పోటీలు ఫ్రీ స్టైల్ విధానంలో 57 కేజీల నుండి 125 కేజీల కేటగిరి వరకు పోటీలు జరిగాయి. రెజ్లింగ్ గ్రీకో రోమన్ విధానంలో 55 కేజీల నుండి 130 కేజీల కేటగిరి వరకు క్రీడాకారులు హాజరై కుస్తీలో ప్రతిభ కనబరిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను యూనివర్సిటీ టీమ్‌గా ఎంపిక చేసి పంజాబ్ లోని చండీగర్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ పోటీలకు పంపుతున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్, సెక్రటరీ స్పోర్ట్స్ బోర్డు ఆచార్య కెవి.స్వామి, అసిస్టెంట్ సెక్రటరీ ఎంవిఎస్ఎస్.మూర్తి, ఆర్గనైజింగ్ చైర్మన్ డి.జ్యోతిర్మయి, అబ్జర్వర్ డాక్టర్ బివి.నరసింహ రాజు, సెలక్షన్ కమిటీ మెంబర్స్ కె.కనకదుర్గ, ఎ.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - దేవరపల్లి


మండలంలోని కురుకూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకట్రాజు ప్రారంభించారు. కురుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్‌పర్సన్ యలమాటి భాస్కరరావు, టిడిపి సీనియర్ నాయకులు కె.చినబాబు, జడ్‌పిటిసి మాజీ సభ్యులు సుధారాణి, దేవరపల్లి సొసైటీ చైర్మన్ ఉప్పులూరి నోమేంద్ర రామారావు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

బాపిరాజుకు ఆర్ట్స్ అసోసియేషన్ గిల్డ్ పురస్కారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ డాక్టర్ పుప్పాల బాపిరాజు ఆర్ట్స్ అసోసియేషన్ గిల్డ్ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం సాయంత్రం విజయవాడ బాలోత్సవ భవన్‌లో జరిగిన సభలో శాసన సభ్యులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. దాదాపు 70 మంది కళాకారుల చిత్రాల ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రియేటివిటీ అండ్ కల్చర్ మిషన్ చైర్ పర్సన్ పొడపాటి తేజస్వి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు మరియు సంస్కృత అకాడమీ చైర్మన్ శరత్‌చంద్ర, సమాజ సేవకులు గోళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కార్టూన్‘నిజం’



స్వర్ణాంధ్ర సేవలు ఆదర్శనీయం : ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాజమహేంద్రవరం నగరంలో 27 ఏళ్లుగా స్వర్ణాంధ్ర పలు సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందిందని ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి వాసు ప్రశంసించారు. సంస్థ దీర్ఘకాలం నడపాలంటే మూల నిధి ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని దానికి నగరవాసులందరూ సహకరించాలని, తానూ సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో పుష్కర్ ఘాట్‌లో సుమారు 250 మందికి పండ్లు, రగ్గులు అందించి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి ఎన్‌బిఎం.మురళీకృష్ణతో కలిసి ఆయన పాల్గొన్నారు. మురళీకృష్ణ మాట్లాడుతూ స్వర్ణాంధ్రతో తనకు మూడు దశాబ్దాల అనుభవం ఉందన్నారు. రాంబాబు చేస్తున్న సేవలకు దాతలు సహకరించాలన్నారు. స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు సుమారు రూ.3.75 లక్షల మూల నిధిని ఏర్పాటు చేశామని తెలిపారు. మూల నిధికి రూ.లక్ష అందించడానికి ముందుకొచ్చిన సిపి.రెడ్డి, రూ.10వేలు అందించేందుకు ముందుకొచ్చిన మెహర్ మధు, గ్రంధి వెంకటేశ్వరరావులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జిల్లా నాయకులు ఉప్పులూరి జానకిరామ్, స్వర్ణాంధ్ర వ్యవస్థాపకులు పడాల రామిరెడ్డి(రావులపాలెం), గంగరాజు పాల డెయిరీ అధినేత నిమ్మలపూడి గోవిందు, ఎన్ఎస్ఆర్ ట్రేడర్స్ అధినేత ఎన్.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


ఆహారం వడ్డిస్తున్న ఎంఎల్‌ఎ, అడిషనల్ ఎస్‌పి

యాత్రికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

కార్తీక మాసం సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కాశిబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఉన్న శివాలయాలు, ఇతర ఆలయాల వద్ద యాత్రికులు తగిన జాగ్రలు తీసుకోవాలని ఎస్‌పి నరసింహకిశోర్ సూచించారు. ఘాట్ల వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటే ఎవరూ కంగారు పడకూడదన్నారు. నెమ్మదిగా, క్యూ లైన్‌లలో వెళ్లాలన్నారు. పోలీస్, దేవాదాయ శాఖ, ఆలయ కమిటీలు ఇచ్చిన సూచనలు, జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్తీక వన భోజనాలు, పిక్నిక్ స్పాట్స్ వద్దకు వచ్చే ప్రజల సంఖ్యను బట్టి తోపులాటలు, తొక్కిసలాటలు జరగకుండా తగినన్ని భోజన కౌంటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అయ్యప్ప పడి పూజలు నిర్వహించే సమయంలో ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్‌లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీపాలు వెలిగించినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. తడి ఇసుక, డ్రమ్ములతో నీటిని ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అవసరమైతే పోలీస్, ఫైర్, రెవెన్యూ, సంబంధిత అధికారులకు ముందస్తుగా తెలియజేయాలన్నారు. పోలీసుల సహాయం కోసం 112కు ఫోను చేయాలన్నారు.

ఉత్సాహంగా మాక్ పోలింగ్

ప్రజాశక్తి-గోకవరం

రంపఎర్రంపాలెం జడ్‌పి ఉన్నత పాఠశాలలో సోమవారం మాక్ పోలింగ్ ఉత్సాహంగా జరిగింది. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పిఒ, ఎపిఒ, ఒపిఒ, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిపించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పెదరెడ్ల రాజు, పి.బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ మాక్ పోలింగ్ నిర్వహించారని హెచ్‌ఎం కె.అబ్బులు తెలిపారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

నగరంలో వీధి కుక్కల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. క్వారీ మార్కెట్ సెంటర్ సమీపంలో ఉన్న ఎబిసి సెంటర్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న సదుపాయాలు, ఆపరేషన్ థియేటర్, షెడ్లు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. పశు వైద్యులతో మాట్లాడి వ్యాక్సినేషన్, యానిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు, శస్త్రచికిత్స అనంతరం పర్యవేక్షణపై ఆరా తీశారు. సగటున నెలకు ఎన్ని ఆపరేషన్లు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. వీధి కుక్కలను ఎక్కడ పట్టుకుంటారో ఆపరేషన్ తర్వాత తిరిగి అదే ప్రాంతంలో విడిచిపెట్టాలన్నారు. సమస్యలుంటే తనను సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట ఎంహెచ్ఒ వినూత్న, ఇఇ మదర్షా అలీ, ఇతర సిబ్బంది ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి -దేవరపల్లి

యర్నగూడెంలోని శ్రీ బొల్లిన గంగరాజు జడ్‌పి ఉన్నత పాఠశాల 2004-05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెన్మెత్స సుబ్బరాజు హాజరై మాట్లాడారు. సామాజిక సేవలో యువత తమ వంతు పాత్ర పోషించడం అభినందనీయమన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించిన ఏలూరు ఆశ్రం హాస్పిటల్ వైద్యులు, సిబ్బందిని, కార్యక్రమానికి సహకరించిన సొసైటీ సిఇఒ మండా పెదబాబు తదితరులను పూర్వ విద్యార్థులు సత్కరించారు.

మంచిరాజుకు పలువురి సంతాపం

ప్రజాశక్తి - పెరవలి



మండలం ఖండవల్లికి చెందిన పంచాయతీ కార్యదర్శి మంచిరాజు నాగసత్యసూర్యసీతారామరావు(57) మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆయన ఉండ్రాజవరం మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ బదిలీపై పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్రకు వెళ్లారు. అక్కడ విధులు నిర్వహిస్తు అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు అతని మృతికి ఎంపిపి కె.సీతారాంప్రసాద్ సొసైటీ అధ్యక్షులు భూపతి రాజు రవివర్మ, సర్పంచ్ పులిదిండి నాగరాజు తదితరులు సంతాపం తెలిపారు.

కొత్తపల్లి- కాపవరం రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి - పెరవలి

కొత్తపల్లి-కాపవరం రోడ్డును తహాశీల్దార్ కె.నిరంజన్, ఎంపిడిఒ కెయుఆర్ఎల్.పద్మజ, మండల సర్వేయర్ కె.గోపాలకృష్ణ సోమవారం పరిశీలించారు. మండలంలో జాతీయ రహదారి నుంచి పెరవలి, కొత్తపల్లి అగ్రహారం, కాపవరం గ్రామాల మీదుగా వెళ్లే రోడ్డు కోసం రూ.1.70 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రెండు కిలోమీటర్ల 18 అడుగుల సిసి రోడ్డు, ఒక కిలోమీటర్ బీటి రోడ్డును నిర్మించేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ పనులకు మంత్రి కందుల దుర్గేష్ ఇటీవలే శంకుస్థాపన చేశారు. పెరవలి పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి నుంచి కొత్తపల్లి అగ్రహారం సొసైటీ వరకు రోడ్డు ఆక్రమణ తొలగింపులో నష్టం చేకూరిందని పలువురు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు సర్వే చేశారు. తహాశీల్దార్ మాట్లాడుతూ సర్వేకు దరకాస్తు చేసుకోవడంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

ట్రస్టుల సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వంతో పాటు చారిటబుల్ ట్రస్టులు, వ్యక్తులు అందిస్తున్న సేవలు మరువలేనివని కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలో తుపాను బాధిత 9 మత్స్యకార కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ నియోజకవర్గంలో 1,330 మంది తుపాను సమయంలో వేటకు దూరమయ్యారన్నారు. వారందరికీ సాయం అందిస్తున్నామన్నారు. పోచవరం గ్రామానికి చెందిన డాక్టర్ బిషప్ గెడ్డం విలియమ్స్, ఇఫ్రాయిమ్ గ్లోబల్ చారిటబుల్ ట్రస్ట్ తుపాను బాధితులను ఆదుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నాని బాబు, ఎంపిడిఒ రాజశేఖర్ రెడ్డి, తహాశీల్దార్ లక్ష్మీలావణ్య, రాగోలపల్లి సొసైటీ అధ్యక్షులు అనపర్తి ప్రసాద్, టిడిపి నాయకులు సిద్దా దుర్గారావు, జనసేన నాయకులు గంటా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణ చర్యలు పాటించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఒంటరి మహిళలు స్వీయ రక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ డి.రవికుమార్ తెలిపారు. సోమవారం చివటం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహిళలకు పలు సూచనలు చేశారు. ఒంటరిగా నివసించే మహిళలు ఇళ్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా దొంగతనాలు, దోపిడీల బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. ఒంటరిగా వాకింగ్, షాపింగ్ చేస్తున్నప్పుడు శరీరంపై బంగారు నగలు లేకుండా చూసుకోవాలన్నారు. సైబర్ క్రైమ్‌పైనా అవగాన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ జి.నవీన్‌కుమార్, జిఎంఎస్‌కె బి రాజేశ్వరి, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవికుమార్

తుపాను బాధితులకు సాయం అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

తుపాను సమయంలో పునరావాస కేంద్రాల్లో బస చేసిన వారికి రాజవోలు పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం ఎంఎల్‌ఎ గొరంట్ల బుచ్చయ్యచౌదరి అందించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి రూ.వేయి చొప్పున, కుటుంబానికి గరిష్టంగా రూ.3వేల చొప్పున అందించామని తెలిపారు. మత్స్యకారుల కుటుంబాలకు 50 కేజీల బియ్యం, ఇతర కుటుంబాలకు 25 కేజీల సూపర్ ఫైన్ బియ్యంతో పాటు ఆరు రకాల నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు వివరించారు. రైతులను ప్రభుత్వం తగిన విధంగా ఆదుకుంటుందన్నారు. రూరల్ మండలం పరిధిలో సుమారు 525 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు.. తడిసిన ధాన్యం కొనుగోలు కూడా జరుగుతోందని, రైతులపై భారం పడకుండా చర్యలు తీసుకున్నామన్నారు. రాజవోలు గ్రామ పంచాయతీ పరిధిలోని 11 కుటుంబాలకు రూ.18వేలు సాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు నిమ్మలపూడి రామకృష్ణ, ప్యాక్ సొసైటీ చైర్మన్ వల్లూరి చెంచురాజు, ఎం.సువర్ణ కుమారి పాల్గొన్నారు.

పెరవలి : తుపాను పునరావాస కేంద్రంలో తలదాచుకున్న 16 కుటుంబాలకు రూ.45వేల నగదు, 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ నూనె, కేజీ బంగాళాదుంపలు, కేజీ ఉల్లి పాయలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగోలు సీతమ్మ, జనసేన మండల అధ్యక్షుడు పిప్పర రవికుమార్, ఎంపిటిసి సభ్యులు రాపాక ప్రమీల నాయకులు, విఆర్ఒ సొంగ రాజు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


తుపాను బాధితులకు సాయం అందిస్తున్న ఎంఎల్‌ఎ గోరంట్ల

గోపాలపురం : తుపాను బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం మండలంలో 1.15 లక్షల ఆర్థిక సహాయం పంపిణీ చేసిందని రెవెన్యూ అధికారులు సోమవారం తెలిపారు. 58 కుటుంబాలకు వీటిని అందించామన్నారు. గోపాలపురం, చిట్యాల, వెంకటాయపాలెం, గంగోలు గ్రామాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు సమక్షంలో లబ్ధిదారులకులీ సాయాన్ని అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.అనురాధ, విఆర్ఒలు ఎన్.శ్రీనివాస్, జివివి.లక్ష్మి, నాయకులు జ్యేష్ట శ్రీధర్, పడమటి శ్రీనివాస్, కుందుల నారాయణరావు, బి.వాసు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : పురుషోత్తపట్నంలో 70 మత్స్యకార కుటుంబాలకు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కారిచర్ల విజయశంకర్ సోమవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. ప్రజలకు సేవలు అందించడానికి జన సైనికులు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో కందికట్ల అరుణకుమారి, ఉందుర్తి ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు : మత్స్యకారులకు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో 995 మంది మత్స్యకారులకు వీటిని అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ రాణిసుస్మిత, మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలోని అన్నంపల్లి పంచాయతీ పరిధిలోని చింతపల్లిలంక గ్రామానికి 17 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. ఈ మేరకు బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం..గుడికి వెళ్ళి వస్తానని ఈ నెల ఒకటో తేదీన సదరు బాలిక ఇంటి దగ్గర చెప్పి బయటకు వెళ్లింది. నాటి నుంచి ఆమె తిరిగి రాకపోవడంతో బంధువులు, బాలిక స్నేహితుల ఇళ్ల వద్ద గాలించారు. అయినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆ బాలిక ఆచూకీ తెలిసిన వారు సెల్ నెంబర్లు 94407 96564, 94407 96528, 89852 54749లకు సమాచారం అందించాలని కోరారు.

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - రావులపాలెం

స్థానిక డిగ్రీ కళాశాల సమీపంలోని జాతీయ రహదారిపై విజిలెన్స్ ఇన్స్పెక్టర్ టి.నాగరాజు నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా టాటా ఏసి వాహనంలో తరలిస్తున్న 4,600 కిలోల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం పెనుమాదం నుంచి జొన్నాడ వైపు 4,600 కిలోల బియ్యాన్ని తరలిస్తున్న జక్కంశెట్టి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బియ్యాన్ని వేములపల్లి ఎంఎల్ఎస్ పాయింట్ గొడౌన్‌కు అప్పగించారు. విజిలెన్స్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.చంటి తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు వెంకటరాజు, ఎజి లక్ష్మీనారాయణ, ఎంఎస్ఒ పి.వెంకటేశ్వరరావు, సిబ్బంది లోవరాజు, వల్లీ పాల్గొన్నారు.

సీతానగరం : సీతానగరం మండలం ముగ్గళ్ళ గ్రామంలో రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. ఇనుగంటి వారి పేట నుంచి కోరుకొండ తరలిస్తున్న ఈ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని కోరుకొండ పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ నాగలక్ష్మికి సమాచారం అందించారు. నాగలక్ష్మి ఈ వాహనాన్ని సీజ్ చేశారు. 6ఎ కేసు నమోదు చేశారు. కోరుకొండ మండలం కాపవరం గ్రామానికి చెందిన తలారి వీరబాబు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలు ఉంటే వెంటనే జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సమాచారం ఇవ్వాలన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - అంబాజీపేట

వాకలగరువు పుష్కరాల రేవులోకి కొట్టుకు వచ్చిన గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. అంబాజీపేట ఎస్ఐ కె.చిరంజీవికి సమాచారం అందించగా సంఘటనా స్థలానికి వెళుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ వైర్లు దగ్ధం

ప్రజాశక్తి - కొత్తపేట

స్థానిక కౌశిక రోడ్డులో జరిగిన అగ్నిప్రమాదంలో విద్యుత్ వైర్లు దహనం అయ్యాయి. సోమవారం విద్యుత్ స్తంభం పక్కన ఉన్న చెత్త కుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న వైర్లకు మంటలు వ్యాపించాయి. పెద్దఎత్తున పొగ, మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో విద్యుత్ శాఖ ఎఇ ఎస్.రామకృష్ణ అప్రమత్తమై ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం వెళ్లడంతో హుటాహుటీనా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. విద్యుత్, అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది.

చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లపూడి

చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గజ్జరం గ్రామానికి చెందిన గన్నిన నరసమాంబ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అపరిచిత వ్యక్తులు వచ్చారు. టివి రిపేరు ఉందని కంప్లైంట్ వచ్చిందని, దాన్ని రిపేరు చేయడానికి వచ్చామని నమ్మబలికారు. టివి బాగానే ఉందని ఆమె బదులిచ్చింది. 'మీ ఇంటికి వచ్చినట్టుగా టివి పక్కన ఫోటో తీసుకోవాలి' అని నిందితులు తెలిపారు. దీంతో వ్యక్తి లోపలికి ప్రవేశించాడు. ఇదే సమయంలో మరికొంత మంది లోనికి వచ్చి ఆమె మెడలో బంగారు గొలుసు లాక్కుని బ్లూ కలర్ మోటార్ బైక్‌పై పారిపోయారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కొవ్వూరు డిఎస్‌పి ఆదేశాలతో కొవ్వూరు రూరల్ ఎస్ఐ విజయబాబు పర్యవేక్షణలో కొవ్వూరు క్రైమ్ స్టేషన్ ఎస్ఐ రవీంద్ర, తాళ్లపూడి ట్రైనీ ఎస్ఐ ఆదిత్య శ్రీనివాస్ దర్యాప్తు చేపట్టారు. సోమవారం మండలంలోని బల్లిపాడు గ్రామం వద్ద దొంగలించిన బంగారం, పారిపోయిన మోటార్ బైకుతో షేక్ సుభానిజానీ, దేశగిరి గంగరాజు, వడ్డీ శరన్‌రాజు గుర్తించి పట్టుకున్నారు. వారిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

హుండీల్లో నగదు చోరీ

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని మల్లవరం గ్రామంలో ఉమామల్లేశ్వరవు స్వామి ఆలయంలో హుండీల్లో నగదు చోరీకి గురైంది. ఆలయ కమిటీ సభ్యుల కథనం ప్రకారం ఉమామల్లేశ్వరవు స్వామి ఆలయంలోని మూడు హుండీలను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి సొమ్మును అపహరించారన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

రెండు రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సీతానగరం

జిల్లాలోని పలు గ్రామాలకు రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు తెలియజేశారు. నవంబర్ 4, 5 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 33/11 కెవి ముగ్గళ్ళ విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలో కొత్త సిసి రోడ్డు నిర్మాణం, 11కెవి సీతానగరం మండల హెడ్ కోటర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగల మార్పు పనులు జరుగుతాయన్నారు. ఈ కారణంగా రఘుదేవపురం, నల్లగొండ. కోరుకొండ మండలంలో కోటి. గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఇఇ నటరాజన్ తెలిపారు.

ఓపెన్ ఎయిర్ థియేటర్ పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రకృతి ఒడిలో సినిమాను ఆస్వాదించాలనుకునే వారిని ఓపెన్ ఎయిర్ థియేటర్ విశేషంగా ఆకట్టుకుంటుందని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్య మైదానాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను పరిశీలించారు. సినిమాల ప్రదర్శన గూర్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజూ ఎంత వీక్షకులు వస్తున్నారు..? అలాగే స్క్రీన్, స్పీకర్ల కండిషన్‌పై ఆరా తీశారు. ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే రాత్రి వేళల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీస్ శాఖకు సూచించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ఆరు బయట ఆహ్లాదకర వాతావరణంలో సినిమాలు చూడటం ఒక మధురానుభూతి అని పేర్కొన్నారు. ఒకప్పుడు పల్లెటూళ్లలో పండగలొస్తే ఊరి మధ్యలో పెద్ద తెరకట్టి సినిమాలు ప్రదర్శించేవారన్నారు. ఆ పాత మధురానుభూతికి, నేటి ఆధునిక హంగులను జోడించి ఏర్పాటు చేసిన ఈ ఓపెన్ ఎయిర్ థియేటర్ నగరవాసులకు సరికొత్త అనుభూతిని పంచుతోందన్నారు. ఆయన వెంట ఇఇ మదర్సా అలీ, ఇతర సిబ్బంది ఉన్నారు.

పర్యావరణ రక్షణలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-కడియం



పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మండలంలోని బుర్రిలంకకు చెందిన శ్రీ ఈశ్వరఫామ్ నర్సరీ అధినేత, టివిసి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాడాల విష్ణు చక్రవర్తి అన్నారు. కార్తీక మాసం రెండవ సోమవారం ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో యాత్రికులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్రాక్షారామ పుణ్యక్షేత్రంలో తమ టీవీసి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు జమ్మి, తులసి, బిల్వ పత్రం, ఉసిరి, మారేడు, పారిజాతం తదితర మొక్కలను కుటుంబ సభ్యులతో కలిసి భక్తులకు వితరణ చేశామన్నారు. ఈ కార్యక్రమానికి అవకాశం కల్పించిన అసిస్టెంట్ కమిషనర్ అల్లు దుర్గా భవానికి, సూపరింటెండెంట్ ఎస్.వెంకన్న బాబుకు, ఆలయ అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రి భీమశంకర్, కర్రి శివన్నారాయణ, ఆనాల రాజబాబు, దవులూరి సత్తిబాబు, సిద్ధా గోపాలకృష్ణ, సుంకర లక్ష్మీనారాయణ, తడాల ఫణి కుమార్, తాడాల కృష్ణకుమార్, తాడాల అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అర్జీదారుల సంతృప్తి ముఖ్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ



పిజిఆర్ఎస్‌లో వచ్చే ప్రజా సమస్యల పరిష్కారంలో అర్జీదారులు సంతృప్తి ముఖ్యమని కమిషనర్ రాహుల్ మీనా సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వ హించిన పిజిఆర్ఎస్‌లో 46 అర్జీలు వచ్చాయి. వీటిలో ఇంజినీరింగ్‌కి సంబంధించి 15, రెవెన్యూకి సంబంధించి 6, టౌన్ ప్లానింగ్‌కి సంబంధించి 13, పబ్లిక్ హెల్త్‌కి సంబంధించి 4, వార్డు సచివాలయాలకు సంబంధించి 8 ఉన్నాయి. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు అందిం చారు. వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని కమిషనర్ సూచించారు. ఒకసారి అందిన అర్జీ మరలా పునరావతం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజవల్లి, ఇన్‌ఛార్జి ఎస్ఇ రీటా, ఎంహెచ్ఒ వినూత్న, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, మేనేజర్ ఎమ్‌డి.అబ్దుల్‌మలిక్, రెవెన్యూ అధికారి సిహెచ్.శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని రాణించాలని, దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదగాలని తాళ్లపూడిలోని శ్రీ విజేత హై స్కూల్ హెచ్ఎం,కవి డాక్టర్ జొన్నకూటి ప్రమోద్‌కుమార్ అన్నారు. మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్‌ను భారత జట్టు గెలవడంతో హై స్కూల్లో విజయోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పాఠశాల అకాడమిక్ ఇన్‌ఛార్జి కె.కరుణ మాట్లాడుతూ మహిళా క్రికెట్ జట్టు విజయం మహిళలకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ సంబరాల్లోఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కాళీకృష్ణకు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి -దేవరపల్లి

తాడేపల్లిగూడెంలో జరిగిన సిరిమువ్వ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ తరపున డాక్టర్ ఎస్.కాళీకృష్ణకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఐకాన్ అవార్డును ప్రదానం చేశారు. ఆయన వాసవి జాగృతి ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్‌గా, అలాగే పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సమాజ సేవా రంగంలో చేసిన కృషికి ఈ అవార్డును అందించారు. కాళీకృష్ణ మాట్లాడుతూ తనకు ఈ గౌరవం దక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, వాసవి జాగృతి సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ముంపు పంటల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో తుపాను ప్రభావిత ప్రాంతాలైన నల్లగొండ, రాపాక, రఘుదేవపురం గ్రామాల్లో నీట మునిగిన పంటలను ఎఒ గౌరీదేవి ఆధ్వర్యంలో ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. పంట పొట్ట కుళ్లిపోవడం, పూత మునిగిపోవడం గమనించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఎఒ మాట్లాడుతూ తుపాను నష్టంపై ప్రాథమిక అంచనాను అధికారులకు అందించామన్నారు. పూర్తి స్థాయిలో పరిశీలించి తుది నివేదిక ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ప్రవీణ్, భాస్కర్ పాల్గొన్నారు.

పరిశోధనలకు సైన్స్ ప్రదర్శనలు దోహదం

ప్రజాశక్తి - తాళ్లపూడి

విద్యార్థుల్లో దాగివున్న పరిశోధన దృక్పథాన్ని వెలికి తీయడానికి సైన్స్ ప్రయోగాలు, ప్రదర్శనలు ఎంతగానో దోహద పడతాయని తాళ్లపూడిలోని సెయింట్ యూజిన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ ఫాదర్ జాన్ (బ్రిట్టో) అన్నారు. పాఠశాలలో సోమవారం సైన్స్ విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. సైన్స్ ఉపాధ్యాయులు బుజ్జి బాబు, నోవా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా స్కూల్ కరస్పాండెంట్ కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ ఆరోన్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్ర వరం ప్రాంగణంలో పిఎం ఉష(రుస) పథకం నిధులతో నిర్మించనున్న నూతన భవనానికి విసి ఎస్.ప్రసన్నశ్రీ సోమవారం శంకుస్థాపన చేశారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని బాయ్స్ హాస్టల్ ఎదురుగా ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా విసి మాట్లాడారు. పిఎం ఉష పథకంలో భాగంగా రూ.9.35 కోట్ల అంచనా వ్యయంతో సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. 8 తరగతి గదులు, ఆక్వాకల్చర్, ఫుడ్ సైన్స్, జియాలజీ, మూక్ స్టూడియో, ఏఆర్,విఆర్ ల్యాబ్ వంటివి ఈ భవనంలో ఉంటాయన్నారు. జి ఫ్లోర్2 నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి, ఆర్ అండ్ బి ఎస్ఇ కాంతు, డిఇఇ మధు, ఎఇఇ కిరణ్, యూనివర్సిటీ ఇంజినీర్లు, కాంట్రాక్టర్ శాంతారామ్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

నేటి నుంచి ఎలక్టోరల్ రోల్స్ నమోదు

ప్రజాశక్తి - యానాం

యానాం నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఫోటో ఎలక్టోరల్ రోల్స్ నవంబర్ 4 నుంచి డిసెంబర్ 4వరకు నిర్వహిస్తున్నట్లు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, ఆర్ఎఒ అంకిత్ కుమార్ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పెషల్ ఇంటెన్సివ్‌లో భాగంగా బూత్ లెవిల్ ఆఫీసర్లు ఇంటింటికీ వచ్చి గణన ఫారాలు అందజేస్తారన్నారు. ఇచ్చిన రెండు కాపీలను పుట్టిన తేదీ, ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు నెంబర్,తల్లి తండ్రి లేదా భార్య పేరు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో వివరాలు నమోదు చేసి వాటిని మళ్ళీ బిఎల్ఒలకు అందజేయాలన్నారు. రెండో కాపీ తిరిగిస్తారన్నారు. బిఎల్ఒలు కనీసం రెండు మూడుసార్లు ఇంటిని సందర్శిస్తారని తెలిపారు. కొత్త ఓటర్లు ఫారం- నింపాలన్నారు. కుటుంబ సభ్యులు ఎవరైనా విద్య కోసం, ఇతర పనుల కోసం బయట ఉన్నట్లయితే వారి ఘనన పత్రాలను కుటుంబ సభ్యులు పూర్తి చేయవచ్చు అన్నారు.

చిక్కాలకు పొట్టి శ్రీరాములు సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - యానాం

పాండిచ్చేరి తెలుగు సేన అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ చిక్కాల నరసింహమూర్తి పొట్టి శ్రీరాములు విశిష్ట సేవారత్న అవార్డును అందుకున్నారు. సిరిసిరి మువ్వ అష్ట వింశతి 28వ వార్షికోత్సవం, ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం, పొట్టి శ్రీరాములు 125వ జయంతోత్సవం సందర్భంగా ఈ అవార్డులను ప్రకటించారు. తాడేపల్లిగూడెంలో సిరిమువ్వ సోషల్ సర్వీస్ అండ్ ఆర్ట్స్‌అసోసియేషన్, పొట్టి శ్రీరాములు అభ్యుదయ వేదిక సిరిమువ్వ ఫౌండర్, కన్వీనర్ సిరిమువ్వ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిక్కాలకు ఆ సంస్థ ప్రతినిధులు, ఇతర ప్రముఖులు అవార్డును ప్రదానం చేశారు.

డిటిగా బాలాశ్రీ బాధ్యతల స్వీకరణ

యానాం డిప్యూటీ తహశీల్దారుగా యానాంకు చెందిన జువ్వల బాలాశ్రీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పుదుచ్చేరి ప్రభుత్వం బాలాశ్రీని యానాం డిటిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం స్థానిక రెవిన్యూ కార్యాలయంలో ఉదయం డిటిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ఉద్యోగులు, పలువురు అధికారులు, ప్రముఖులు బాలాశ్రీని శాలువాలతో సత్కరించి అభినందించారు.


ఢిల్లీలో పలువురిని కలిసిన మల్లాడి

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం పలువురిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా కేంద్ర క్రీడలు యువజన మంత్రిత్వశాఖ మంత్రి మునీష్క్ మాండవితో బేటీ అయ్యారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కు సంబంధించిన విషయాలు చర్చినట్లు తెలిపారు. ఖోఖ్ఖ, కరాటే, తైక్వాండో, అథ్లెటిక్స్ విభాగాలు యానాం శాయ్‌లో ఏర్పాటు చేయాలని, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ విభాగాల ఏర్పాటు, స్విమ్మింగ్ పూల్ గ్యాలరీ, డ్రెస్ ఛేంజింగ్ రూమ్స్, టాయిలెట్స్, ఫిట్నెస్ (జిమ్) తదితర వాటి అభివృద్ధికి ఖేలో ఇండియన్ నుంచి రూ.2.5 కోట్లు కేటాయించాలని కోరనన్నారు. మెట్టకూరు, దరియాలతిప్ప, సావిత్రి నగర్లలో క్రికెట్ గ్రౌండ్లకు రూ.మూడు కోట్ల కేటాయించాలన్నారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-శంఖవరం

కార్తీకమాసంలో అన్నవరంలో గిరి ప్రదక్షిణ ప్రదేశాలను ఎస్‌పి బిందు మాధవ్ పరిశీలించారు. సోమవారం అన్నవరం వచ్చిన ఆయన ఇఒ సుబ్బారావు, పోలీస్ సిబ్బందితో కలిసి ఈ నెల 5న నిర్వహించే గిరి ప్రదక్షిణ రహదారిని పరిశీలించారు. ఆ రోజున భారీ వాహనాల ప్రవేశం నిషేధమని, యాత్రికుల రాకపోకల మార్గాలు స్పష్టంగా గుర్తించేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.



చెస్ పోటీల్లో గెలుపొందిన జ్యోతి జ్వాలశ్రీ

చెస్ పోటీలకు నారాయణ స్కూల్ విద్యార్థి

ప్రజాశక్తి - కాకినాడ

గాంధీనగర్ తిరుమల రావు వీధిలోని నారాయణ హైస్కూల్ విద్యార్థి చెస్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపల్, కరస్పాండెంట్ టివిఎస్.నారాయణ తెలిపారు. సోమవారం డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీల్లో మహిళల విభాగంలో జ్యోతి జ్వాలశ్రీ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. ఈ నెల 7, 8 ,9 తేదీలలో శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు కాకినాడ జిల్లా జట్టు తరపున జ్యోతి జ్వాలశ్రీ పాల్గొంటుంది.

సామాజిక అవగాహన పెంపొందించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

దేశ భవిష్యత్తుకు వెన్నెముక అయిన యువతను సమీకరించి వారిలో సామాజిక అవగాహన పెంపొందించాలని డివైఎఫ్ఐ నాయకులు యాసలపు రమేష్ అన్నారు. డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక వరహాలయ్యపేటలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి రొంగల ఆనంద్, లక్ష్మణ్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా యువతను సమీకరించి వారిలో సామాజిక చైతన్యం కల్పించడంలో డివైఎఫ్ఐ ప్రముఖ పాత్ర వహించిందన్నారు. దేశ సమగ్రత, సమైక్యత, దేశభక్తి భావాలను పెంపొందించడంతోపాటు వారిని సామాజిక సమస్యలపై సమీకరించి పోరాటాలు నిర్వహించిందన్నారు. కళాకారులు రొంగల వీర్రాజు, దారపురెడ్డి కష్ణ, మహాపాతిన రాంబాబు, దారపురెడ్డి సత్యనారాయణ అభ్యుదయ గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో కూనిరెడ్డి అప్పన్న, నెక్కల నరసింహమూర్తి, సూరిబాబు, అరుణ్ పాల్గొన్నారు.

కాలువ గట్టు ఆక్రమణపై రీ సర్వేకు వినతి

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రాచీన మాండవ్య నారాయణ స్వామి ఆలయం సమీపంలో ఇరిగేషన్‌కు చెందిన కాల్లగట్టు ఆక్రమణలపై రీ సర్వే నిర్వహించాలని రైతులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. రైతు నాయకుడు బిక్కిన శ్రీరంగనాయకులు, నేతల హరిబాబు, గ్రామ రైతులతో కలిసి సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ, నెల రోజుల క్రితం తాము ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అధికారులు సర్వే నిర్వహించినా, అది సరైన విధంగా చేయలేదన్నారు. నీటిపారుదల శాఖకు చెందిన సుమారు 60 సెంట్ల ప్రభుత్వ భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి, కట్టడాలు నిర్మించి, బహిరంగ విక్రయాలు జరిపి లాభాలు ఆర్జిస్తున్నారని తెలిపారు. తక్షణమే అందరి సమక్షంలో పూర్తిస్థాయి విచారణతో రీ సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని ఆక్రమణల చెర నుండి రక్షించాలని డిమాండ్ చేశారు.

బాలుని వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జగ్గంపేట, కిర్లంపూడి

కాలిన గాయాలతో బాధ పడుతున్న బాలుని వైద్యానికి మణికర్ణిక టీమ్ సహాయాన్ని అందించింది. కిర్లంపూడి మండలం బూరుగుపూడికి చెందిన ఐదేళ్ల సాయి దత్త కాలిన గాయాలతో బాధ పడుతున్నాడు. అతడికి మెరుగైన వైద్యానికి అయ్యే ఖర్చుల కోసం తల్లిదండ్రులు దాతల సహాయాన్ని కోరారు. విషయం తెలుసుకున్న మణికర్ణిక టీమ్ సభ్యులు దాతల నుండి రూ.60 వేలు సేకరించి టిడిపి నాయకులు పాటంశెట్టి రవి సమక్షంలో బాలుడి తల్లి వరలక్ష్మికి అందజేశారు. మణికర్ణిక సంఘం అధ్యక్షులు గున్నాబత్తుల పూజా అనూష, ఉపాధ్యక్షుడు మొగలంక శ్రీనివాస్, సభ్యులు స్వామి, రమేష్ పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి- తాళ్లరేవు

ఇటీవల కోరంగి వద్ద ఆటో ప్రమాదంలో మృతి చెందిన అరుబరుకుల లక్ష్మి కుటుంబానికి సొసైటీ నుంచి మంజూరైన రూ.2 లక్షల బీమా సొమ్మును సోమవారం మృతురాలు లక్ష్మి కుమారుడు రామ్‌జీకి ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు వాసంశెట్టి గోవిందు, ఏసూరి సత్తి రాంబాబు, టిడిపి మండల అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగ సూర్యనారాయణ, పొన్నమండ రామలక్ష్మి, వాద్రేవు వీరబాబు, కట్టా త్రిమూర్తులు, వినోద్, వెంటపల్లి ఉమామహేశ్వరి, కొప్పిశెట్టి చంటి, ఆనందరావు పాల్గొన్నారు.

చేనేతకు ఉచిత విద్యుత్ హామీ నెరవేర్చాలి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

కూటమి ప్రభుత్వం చేనేత మగ్గాలకు కల్పిస్తామన్న ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చాలని కోరుతూ సోమవారం మండలంలోని చేబ్రోలు గ్రామానికి చెందిన ఎపి పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ, బేతా మణికంఠ పిఠాపురం పాడా కార్యాలయంలో ఎపిడి వసంత మాధవికి వినతిపత్రం అందజేశారు. జయకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేనేత కుటుంబాలకు సాధారణ మగ్గాలు ఉన్నవారికి 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లకు ఉచిత విద్యుత్తు అందిస్తామని హామీ ఇచ్చి 18 నెలలు కావస్తున్నా హామీని నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా హామీలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేలేటి రాజేష్, బండారు మణికంఠ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న రంగనాగ్, సూరిబాబు రాజు

ఎంఆర్ కాలేజిలో ఆటల పోటీలు

ప్రజాశక్తి-పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాలలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను నిమ్మకాయల రంగనాగ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ప్రారంభించారు. ఈ క్రీడా పోటీల ప్రారంభ సభలో వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండి విద్యార్థులను క్రీడా పోటీల్లో ప్రోత్సహించాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శరీర ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం సిద్ధిస్తుందన్నారు. డివిజన్ కోఆర్డినేటర్ కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అండర్ 14, అండర్ 17 విభాగాలలో బాల బాలికలకు కబడ్డీ, బాస్కెట్‌బాల్, కోకో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో 11 మండలాల నుంచి 750 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీడీలు వరసాధనం, సుబ్బారావు, కె.శ్రీనివాస్, వీరబాబు, విశ్వేశ్వరరావు, లచ్చుబాబు పాల్గొన్నారు.

సివిల్ రైట్స్ డే జరపాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్



జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు మేరకు ప్రతి నెలా చివరి రోజు, ఒక గ్రామం, పట్టణంలో అన్ని కులాలతో కలిపి సివిల్ రైట్స్ డే జరపాలని కెవిపిఎస్ జిల్లా ప్రఅధాన కార్యదర్శి జువ్వల రాంబాబు కలెక్టర్ కీర్తి చేకూరికి సోమవారం వినతిపత్రం అందించారు. జిఒ 105 ప్రకారం సివిల్స్ రైట్స్ డేను నిర్వహించాల్సి ఉన్నా జిల్లాలో రెవెన్యూ, పోలీసు అధికారులు దీన్ని ఎక్కడా అమలు చేయట్లేదన్నారు. వెంటనే సివిల్ రైట్స్ డే జరిపేలా ఆదేశాలివ్వాలని కలెక్టర్‌ను కోరారు.

కార్యకర్త కుటుంబానికి అండగా అభిరామ్

ప్రజాశక్తి - సీతానగరం

టిడిపి రాజానగరం నియోజకవర్గ యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ సీతానగరం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త పొట్నూరి అరుణ్‌కుమార్ కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. ఉపాధి నిమిత్తం ఇటీవల అరుణ్‌కుమార్ హైదరాబాద్ వెళ్తూ రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. విషయం తెలియడంతో సోమవారం ఆయన అరుణ్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదర్చారు. రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యకర్త కుటంబానికి అండగా ఉంటామని తెలిపారు. అలాగే సీతానగరానికి చెందిన వలవల ఆదినారాయణ ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. సింగవరం నాగరత్నం కాలనీకి చెందిన ఆళ్ళ కనకరత్నం గుండెపోటుతో మతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం తెలిపారు.

త్వరలో పోస్ట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాకు సంబంధించి పోస్ట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ సిద్ధం చేయనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. విపత్తుల సమయంలో మరింత వేగంగా స్పందించే విధానాన్ని బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటల వివరాలను త్వరితగతిన నమోదు చేసి రైతులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పంటల నష్టం అంచనా పూర్తయినప్పటికీ, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో మిగిలిన వివరాలను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. పిజిఆర్ఎస్‌లో సోమవారం 200లకు పైగా అర్జీలు స్వీకరించామన్నారు. వీటిని నాణ్యతతో పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.